నమస్తే తెలంగాణ | DISTRICT SUPPLEMENT

# మంచిర్యాల
# కుమ్రం భీం ఆసిఫాబాద్

ఆదివారం 3 డిసెంబర్ 2023 | SUNDAY, DECEMBER 3, 2023 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD | పేజీలు PAGES : 8




# నేడే తీర్పు

JUDGMENT DAY

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం



హాజీపూర్ : ఓట్ల లెక్కింపు కోసం ముల్కలలోని ఐజా ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన టేబుళ్లు

- ఉదయం 8 గంటల నుంచే కౌంటింగ్ ప్రారంభం
- ముందుగా పోస్టల్ బ్యాలెట్.. తర్వాత ఈవీఎంలు..
- ప్రతి నియోజకవర్గంలో లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు
- మధ్యాహ్నం వరకు వెల్లడికానున్న పూర్తి ఫలితాలు
- ప్రతి కేంద్రం వద్ద మూడంచెల పోలీసు భద్రత
- కౌంటింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- ర్యాలీలకు అనుమతి లేదు.. అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు..
- సెల్‌ఫోన్లు, సిగరేట్లు, వాటర్ బాటిళ్లను అనుమతించరు..
- తేలిపోనున్న పది అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థుల భవితవ్యం

మధ్యపేజీలో

**ఓట్ల లెక్కింపు కేంద్రాలు..**

మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలంలోని ముల్కల్ల సమీపంలో గల ఐజా ఇంజినీరింగ్ కాలేజీలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆసిఫాబాద్, సిర్పూర్ ఓట్లను లెక్కిస్తారు.

**అసెంబ్లీ ఎన్నికల పర్వం** తుదిదశకు చేరుకుంది. నవంబర్ 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడగా.. 30వ తేదీన ఎన్నికలు జరిగాయి. నేడు(ఆదివారం) నాలుగు జిల్లాల్లో ఓట్ల లెక్కింపునకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుండగా.. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ఓట్లను, అనంతరం ఈవీఎంలలోని ఓట్లను లెక్కిస్తారు. ప్రతి నియోజకవర్గంలో లెక్కింపునకు 14 టేబుళ్లు ఏర్పాటు చేశారు. పోలీసులు కౌంటింగ్ కేంద్రాల వద్ద మూడంచెల భద్రత, 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, సిగరేట్లు, వాటల్ బాటిళ్లను అనుమతించరు. సెంటర్స్ పరిధిలో ర్యాలీలకు అనుమతి లేదు. ఎన్నికల నిబంధలను అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పోలీసులు వెల్లడించారు. కాగా.. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది నియోజకవర్గాల అభ్యర్థుల భవితవ్యం పూర్తిస్థాయిలో మధ్యాహ్నం వరకు తేలనుంది. *- మంచిర్యాల, డిసెంబర్ 2(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*




ఆసిఫాబాద్‌లోని ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు



## మంచుకురిసే వేళలో..

పొగమంచుతో నిండిన భైంసా బైపాస్ రోడ్డు ప్రాంతం

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో** పొద్దంతా ఉష్ణోగ్రతలు బాగానే ఉంటున్నా.. రాత్రి పూట పడిపోయి క్రమంగా చలి తీవ్రత పెరుగుతున్నది. ఉదయం 7 గంటల దాకా పొగమంచు తొలగడం లేదు. వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. తప్పనిసరి పరిస్థితుల్లో హెడ్‌లైట్లు వేసుకొని ప్రయాణించాల్సి వస్తున్నది. శనివారం ఉదయం భైంసా పట్టణంతో పాటు భీంపూర్ మండలం భీంపూర్, కరంజిలో కనిపించిన మంచు దృశ్యాలు ఆకట్టుకున్నాయి. *- భైంసా/భీంపూర్, డిసెంబర్ 2*

## గూడెంలో భక్తుల సందడి

- కార్తీక బహుళ పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు
- పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు.. గంగమ్మ తల్లికి మొక్కులు
- సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

**కార్తీక బహుళ పంచమి** సందర్భంగా మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం సత్యనారాయణ స్వామి ఆలయం భక్తులతో సందడిగా కనిపించింది. శనివారం ఉదయం ఆయా ప్రాంతాల నుంచి తరలివచ్చిన ప్రజలు పవిత్ర గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. కార్తీక దీపాలు వదిలి.. గంగమ్మ తల్లికి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గుట్ట కింది భాగంలో రావి చెట్టు వద్ద, గుట్టపైన ధ్వజస్తంభం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. 465 మంది సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరించారు. అనంతరం అభిషేకాలు, అర్చనలు చేశారు. *- దండేపల్లి, డిసెంబర్ 2*



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు